క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌ పార్టీకి ఎంపీపీ రాజీనామా



ఎంపీపీ సుజాత

గరిడేపల్లి : గరిడేపల్లి ఎంపీపీ పెండెం సుజాత, ఆమె భర్త మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్‌ బుధవారం బీఆర్‌ఎస్‌ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు మంత్రి జగదీశ్‌రెడ్డికి, బీఆర్‌ఎస్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్‌, హుజూర్‌నగర్‌ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డిలకు రాజీనామా లేఖ పంపారు. గత కొద్ది రోజులుగా బీఆర్‌ఎస్‌ పార్టీలో జరుగుతున్న పరిణామాలు తీవ్ర మనస్థాపానికి గురిచేశాయని దీంతో పార్టీలో ఇమడలేక ఈ నిర్ణయం తీసుకున్నామని ఆ లేఖలో పేర్కొన్నారు.

మేళ్లచెరువు శివాలయంలో చందర్‌రావు పూజలు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి ఆయనకు స్వామివారి ఆశీర్వచనాలు అందించారు. ఆయన వెంట కాంగ్రెస్‌ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఓపెన్‌ ఐస్‌ సొసైటీ సభ్యులు

హుజూర్‌నగర్‌ : పట్టణంలో 50 మంది పేదలకు ప్రభుత్వ ఉపాధ్యాయుడు పల్నాటి కృష్ణారెడ్డి తల్లి పద్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఓపెన్‌ ఐస్‌ సొసైటీ ఆధ్వర్యంలో రూ.10 విలువ గల దుప్పట్లను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి సులువ శ్రీను, సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న చలసాని ఫౌండేషన్‌ అధినేత చలసాని రాజీవ్‌

నేరేడుచర్ల : దివ్యాంగులు మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగాలని చలసాని ఫౌండేషన్‌ అధినేత చలసాని రాజీవ్‌ అన్నారు. బుధవారం మండలంలోని దిర్శించర్లలో దివ్యాంగ దంపతులు కోట కరుణాకర్‌ శైలజకు ఐజేయూ జాతీయ కౌన్సిల్‌ సభ్యుడు చలసాని శ్రీనివాసరావుతో కలిసి రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం బాప్టిస్ట్‌ చర్చిలో జరిగిన ప్రార్థనలో వారు పాల్గొన్నారు. జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య, సత్తార్‌, వినోద్‌, వెంకన్న, నాగయ్య, మనోహర్‌, వినోద్‌ పాల్గొన్నారు.

బహుమతులు అందజేత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్‌ జోగు సరోజనపిచ్చిరెడ్డి

గరిడేపల్లి : దసరా పండుగ సందర్భంగా మండలంలోని పొనుగోడు గ్రామంలో ఫ్రెండ్స్‌ యూత్‌ ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి క్రికెట్‌ పోటీలు నిర్వహించారు. క్రికెట్‌ పోటీలో గెలుపొందిన విజేతలకు గ్రామ సర్పంచ్‌ జోగు సరోజనపిచ్చిరెడ్డి చేతుల మీదుగా బుధవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు, గ్రామపెద్దలు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేయాలి

మునగాల : అసెంబ్లీ ఎన్నికల్లో కోదాడ నియోజకవర్గం నుంచి పోటీ చేసే పార్టీల నాయకులు వారివారి పార్టీల మేనిఫెస్టోతో పాటు లోకల్‌ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేయాలని సామాజిక ఉద్యమకారుడు డా.వేమూరి సత్యనారాయణ ఒక ప్రకటనలో డిమాండ్‌ చేశారు. కోదాడ నియోజకవర్గంలో ప్రధాన సమస్యలతో పాటు ప్రజలు కోరుకుంటున్న అభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి, సామాన్య మధ్య తరగతి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా లోకల్‌ ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఆయా పనులకు మొదటి ప్రాధాన్యం కల్పించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.

ప్రజాగర్జన సభను జయప్రదం చేయాలి

మునగాల : సూర్యాపేటలో ఈనెల 27న హోం మంత్రి అమిత్‌ షా పాల్గొననున్న 'ప్రజాగర్జన'సభను విజయవంతం చేయాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రెణబోతు శ్రీనివాసరారెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు మండలంలోని ప్రతి కార్యకర్త విధిగా హాజరు కావాలన్నారు. పార్టీ నాయకులు వీరబాబు, దాసరి మధు, గోపి పాల్గొన్నారు.

బంతి సాగు.. ఆదాయం బాగు

- రెండు రోజులకోకసారి పంట కోత
- కిలో పూలు రూ.70కి విక్రయం



నడిగూడెం మండలం సిరిపురం వద్ద సాగులో ఉన్న బంతి పంట

నడిగూడెం : నీటి సౌకర్యం ఉంటే సాధారణంగా రైతులు వరి పంట సాగు చేస్తుంటారు. ఇక వరికి కూడా రోజురోజుకూ పెట్టుబడులు పెరుగుతున్నాయి. విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు, కూలీల ఖర్చులు, నూర్పిడి ఇలా చూస్తూ ఉంటే ఒక ఎకరానికి దాదాపు రూ.18 వేలకు పైగా పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. దీంతో ఓ రైతు భిన్నంగా ఆలోచించి పంట మార్పిడి అవలంబిస్తున్నాడు. ఆ రైతుకు ఉన్న రెండు ఎకరాల భూమిలో అర ఎకరంలో తొలిసారిగా బంతి పంటను సాగు చేస్తూ నిత్యం ఆదాయం పొందుతూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. నడిగూడెం మండలం సిరిపురం గ్రామానికి చెందిన నిండుచర్ల రామ్మూర్తికి శ్రీరంగాపురం రహదారి వెంట రెండు ఎకరాల సాగు భూమి ఉంది. వ్యవసాయ బావి ద్వారా గతంలో వరి పంట పండించేవాడు.. కానీ ఈ ఏడాది రెండు ఎకరాల భూమిలో 1.50 ఎకరంలో వరి, అర ఎకరంలో బంతి పంట సాగు చేపట్టాడు. ఎన్టీఆర్‌ జిల్లా చిల్లకల్లు వద్ద అర ఎకరానికి సరిపడా రెండు రకాలైన ఎరుపు, పసుపు రంగుల బంతి మొక్కలను తీసుకొచ్చి సాగు చేపట్టాడు. బంతి నారుతో పాటు, ఎరువులు, అంతర కృషి, కూలీలు ఖర్చులు దాదాపు ఇప్పటివరకు రూ.25 వేలు పెట్టుబడి వచ్చిందని రైతు చెబుతున్నాడు.

బంతి పూలతో నిత్యం ఆదాయం

ప్రస్తుతం సమయంలో దసరా పండుగతో పాటు అయ్యప్ప మాలదారణ సీజన్‌ కావడంతో బంతి పూలకు డిమాండ్‌ పెరిగింది. సిరిపురం గ్రామంతో పాటు, శ్రీరంగాపురం గ్రామానికి చెందిన అయ్యప్ప భక్తులు ప్రత్యేక పూజల కోసం రైతు రామ్మూర్తి వద్ద బంతి పూలను కొనుగోలు చేస్తున్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా పూలు బానే అమ్ముడుపోయాయని రైతు చెబుతున్నాడు. రెండు రోజులకు ఒకసారి 50 కిలోలు పంట దిగుబడి వస్తుంది. కిలో పూలు రూ.70 చొప్పున విక్రయిస్తూ గత కొద్ది రోజులుగా నిత్యం ఆదాయం పొందుతున్నాడు రైతు రామ్మూర్తి.

ప్రభుత్వం ప్రోత్సహించాలి



అర ఎకరంలో ఈ ఏడాది తొలిసారిగా బంతి పంట సాగు చేపట్టాను. ఇప్పటి వరకు రూ.25 వేలు పెట్టుబడి వచ్చింది. దిగుబడి మాత్రం రెండు రోజులకు ఒకసారి 50 కిలోలు వస్తోంది. కిలో బంతి పూలు రూ.70కు విక్రయిస్తున్నాను. పంట మార్పిడి పాటించడంతో నిత్యం ఆదాయం వస్తుంది. మా లాంటి రైతులకు ప్రభుత్వం రాయితీలు ఇచ్చి, ప్రోత్సహిస్తే బాగుంటుంది.

– నిండుచర్ల రామ్మూర్తి, రైతు, సిరిపురం

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు మేలు

- మాజీ ఎమ్మెల్యే పద్మావతి



మునగాల : జెడ్పీటీసీ ప్రమీల, పార్టీ ముఖ్య నాయకులతో మాజీ ఎమ్మెల్యే పద్మావతి



కోదాడరూరల్‌ : దోరకుంటలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

కోదాడరూరల్‌ : కాంగ్రెస్‌ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అల్వాలపురం, దోరకుంట, చిమిర్యాల, మంగళితండా గ్రామాల్లో గడప గడపకు కాంగ్రెస్‌ పార్టీ ప్రచార కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ పార్టీ అధికారంలోకి వచ్చాక అవినీతి రాజ్యమేలుతుందని విమర్శించారు. దోరకుంటలో పలు పార్టీలకు చెందిన నాయకులను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, ఏర్నేని బాబు, ఎండీ.మహబూబ్‌జానీ, తూమాటి వరప్రసాద్‌రెడ్డి, బుర్రా పుల్లారెడ్డి, గద్దల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌ గెలుపునకు కృషిచేయాలి

మునగాల : అసెంబ్లీ ఎన్నికల్లో కోదాడ నియోజకవర్గంలో కాంగ్రెస్‌ పార్టీ గెలుపునకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని కాంగ్రెస్‌ కోదాడ ఎమ్మెల్యే అభ్యర్థి నలమాద పద్మావతి కోరారు. మండల కేంద్రంలో ఇటీవల బీఆర్‌ఎస్‌ నుంచి కాంగ్రెస్‌లో చేరిన జెడ్పీటీసీ నల్లపాటి ప్రమీల – శ్రీనివాస్‌ దంపతులను వారి నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. తిరిగి సొంతగూటికి చేరుకున్న వారిని ఆమె అభినందించారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు కొలిశెట్టి బుచ్చిపాపయ్య, కొప్పుల జైపాల్‌రెడ్డి, ఉప్పుల జానకిరెడ్డి, ఎలక నరేందర్‌రెడ్డి, శంకర్‌, కోటేశ్వరరావు, బోస్‌, రషీద్‌, నరేష్‌, రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

మండలంలోని నేలమర్రికి చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌ గ్రామ శాఖ అధ్యక్షుడు నలబోలు సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కోదాడ కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో పద్మావతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో దొంతగాని లింగస్వామి, నలబోలు లింగారెడ్డి, రెణబోతు జానకిరెడ్డి, కొనుగంటి వెంకటరెడ్డి, అలుగుబెల్లి వెంకటరెడ్డితో పాటు వారి అనుచరులు ఉన్నారు.

బొల్లం మల్లయ్యయాదవ్‌ గెలుపునకు కృషిచేయాలి

నడిగూడెం : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కోదాడ ఎమ్మెల్యేగా బొల్లం మల్లయ్యయాదవ్‌ను రెండోసారి గెలిపించడానికి కృషిచేయాలని బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు పల్లా నర్సిరెడ్డి కోరారు. బుధవారం మండలంలోని బృందావనపురంలో బీఆర్‌ఎస్‌ గ్రామ శాఖ సమావేశంలో గ్రామశాఖ అధ్యక్షుడు కాసాని ఉపేందర్‌ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 29న కోదాడ నిర్వహించనున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కేసీ గుప్తాకు నివాళి



కేసీ గుప్త చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వాసవీ, వనితా క్లబ్‌ సభ్యులు

నేరేడుచర్ల : పట్టణంలోని రైస్‌ మిల్లర్స్‌ అసోసియేషన్‌ భవనంలో వాసవి క్లబ్‌ వ్యవస్థాపకుడు కలవ్రకుంట్ల చంద్రసేన గుప్త వర్ధంతి వేడుకలను వాసవి, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీ గుప్త చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రూప్‌ సభ్యులకు రక్త నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వాసవి, వనితా క్లబ్‌ అధ్యక్షులు కొత్తా లక్ష్మణ్‌, వీరవల్లి శ్రీలతాకోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి గజ్జల కోటేశ్వరరావు, భాగ్యలక్ష్మి, అశోక్‌, నటరాజ్‌, గోపాలకృష్ణ, పరమేశం, ల్యాబ్‌ టెక్నీషియన్‌ రవీందర్‌ తదితరులు పాల్గొన్నారు.

బేతవోలులో కబడ్డీ పోటీలు ప్రారంభం



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్‌, ప్రజాప్రతినిధులు

చిలుకూరు : దసరా పండుగ సందర్భంగా మండలంలోని బేతవోలు గ్రామంలో న్యూ నెమ్మాది గురవయ్య మెమోరియల్‌ యూత్‌ ఆధ్వర్యంలో అయిదు రోజుల పాటు నిర్వహించే ఆల్‌ ఇండియా ఇన్విటేషన్‌ కబడ్డీ పోటీలను బుధవారం సర్పంచ్‌ వట్టికూటి చంద్రకళ నాగయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు. గురువారం ఆల్‌ ఇండియా ఇన్విటేషన్‌ టీమ్‌ల కబడ్డీ పోటీలు ముమ్మరంగా జరుగుతాయని క్రీడాకారులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని క్రీడల నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బజ్జూరి వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్‌ బిట్టు అంతయ్య, ఎంపీటీసీలు నెమ్మాది సైదాబాబు, వట్టికూటి ధనమూర్తి, యూత్‌ అధ్యక్షుడు నెమ్మాది నాగరాజు, కార్యదర్శి నెమ్మాది రాంబాబు, గేమ్స్‌ కార్యదర్శి నెమ్మాది దానియేలు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న ఎస్‌ఐ పరమేష్‌

నేరేడుచర్ల : అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్‌ కోరారు. బుధవారం మండలంలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించారు. అనంతరం మేడారంలో రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. పార్టీల నాయకులు ఎన్నికల ప్రచారాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని తెలిపారు. ఎక్కడైనా గొడవలు జరిగే అవకాశం ఉంటే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సర్పంచ్‌ స్వాతిమధు, అరిబండి సురేష్‌బాబు, సీతారామయ్య, కట్టా మధు, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులు రాజ్యాధికారానికి ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గిద్దె రాజేష్‌

మోతె : వికలాంగుల ఓట్లతో గద్దెనెక్కి బురద రాజకీయాలు చేస్తున్న రాజకీయ పార్టీల భరతం పడుతామని భారత వికలాంగుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్‌ అన్నారు. బుధవారం మండలంలోని బుర్కచర్ల గ్రామంలో నిర్వహించిన వికలాంగుల సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్ట సభల్లో ప్రజాప్రతినిధులు వికలాంగుల సమస్యల ఊసే ఎత్తని కారణంగానే వికలాంగుల సమాజం రాజ్యాధికారం కోసం ఉద్యమించాల్సిన సమయం వచ్చిందన్నారు. వికలాంగులకు విద్య, ఉద్యోగ, ఇతర రంగాల్లో రిజర్వేషన్లు పొడిగించాలన్నారు. వికలాంగులు చాలిచాలని పెన్షన్లతో జీవనం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాల్లో వికలాంగుల జెండా ఎగురవేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. వికలాంగుల సంఘం జిల్లా క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌ జింజిరాల సుధాకర్‌ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వికలాంగుల సంఘం మండల అధ్యక్షుడు పిడమర్తి సైదులు, ఉప్పునూతల నర్సయ్య, నిమ్మరబోయిన నర్సయ్య, కొండ రేణుక, కొండ చంద్రయ్య, వాడగల్ల నర్సయ్య, కోడి భద్రకళ, నిమ్మరబోయిన ఉప్పలయ్య, కొండ యల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలి



కోదాడరూరల్‌ : సాయి మందిరంలో పూజలు చేస్తున్న ఎంపీపీ కవిత, నాయకులు

కోదాడరూరల్‌ : కోదాడలో ఈనెల 29న నిర్వహించతలపెట్టిన సీఎం కేసీఆర్‌ ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని ఎంపీపీ చింత కవితారాధారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నల్లబండగూడెంలో గల సాయి మందిరంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌ గెలవాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సీఎం సభ సన్నాహక సమావేశంలో మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు ఎన్నికలు అయ్యేంత వరకు సైనికుల్లా పనియాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు కాసాని వెంకటేశ్వర్లు, సమన్వయ కమిటీ సభ్యులు శంకరశెట్టి కోటేశ్వరరావు, జమ్మలమూడి నారాయణరావు, గంటా శ్రీనివాసరావు, బెంజిమెన్‌, వేలాద్రి, ఉద్దండు, వెంకటేశ్వర్లు, క్రాంతికుమార్‌, శ్రీను, సైదులు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి అక్షర ఎన్‌ఎంఎంఎస్‌ ఉచిత ఆన్‌లైన్‌ కోచింగ్‌

సూర్యాపేటటౌన్‌ : అక్షర ఫౌండేషన్‌ సూర్యాపేట ఆధ్వర్యంలో సుధాకర్‌ పీవీసీ పైప్స్‌ సౌజన్యంతో కేంద్ర మానవ వనరుల శాఖ నిర్వహించే నేషనల్‌ మీన్స్‌ కం మెరిట్‌ స్కాలర్‌షిప్‌ టెస్ట్‌కు ఉచిత ఆన్‌లైన్‌ కోచింగ్‌ను ఈ నెల 26నుంచి ప్రారంభిస్తున్నట్టు అక్షర ఫౌండేషన్‌ చైర్మన్‌ యాస రాంకుమార్‌ రెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కోచింగ్‌ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రాల ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎస్‌సీఈఆర్‌టీ స్టేట్‌ రీసోర్స్‌ పర్సన్‌ అధ్యాపకులచే మెంటల్‌ ఎబిలిటి, మ్యాథ్స్‌, ఫిజిక్స్‌, బయో సైన్స్‌, సోషల్‌ అంశాలపై ప్రతి రోజూ 5గంటల పాటు కోచింగ్‌ అందజేస్తున్నామని తెలిపారు. ఈ స్కాలర్‌సిప్‌లో సెలెక్ట్‌ అయిన విద్యార్థులకు రూ.48వేలు కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ప్రతి రోజు ఆన్‌లైన్‌ ద్వారా ప్రాక్టీస్‌, మోడల్‌ టెస్టులు నిర్వహిస్తున్నామని, పూర్తి వివరాలకు సెల్‌: 9573263625 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఉప్పు నాగయ్య, పాల్వాయి వెంకన్న, బత్తుల ఉపేందర్‌, దామోదర్‌రెడ్డి, చొల్లేటి ఉపేంద్రాచారి, నాని, ఎస్‌కె.బాషు, యాస శృతి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సూర్యాపేట నియోజకవర్గ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పలు వార్డులకు చెందిన బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ కార్యకర్తలు బీజేపీలో చేరిన సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. సూర్యాపేట నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక అయిన హైదరాబాద్‌– విజయవాడ ఎర్రైల్వే లైన్‌ను ఆమోదించడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, జిల్లాలో నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉన్నందున యువతకు ఉద్యోగాలు ఉపాధి కల్పన కోసం జిల్లాలో ఐటీ హబ్‌లు, పరిశ్రమలను తీసుకువచ్చి లక్ష మందికి ఉపాధి కల్పించబోతున్నామన్నారు. పార్టీలో చేరిన వారిలో కుంచం రామారావు, శివరాత్రి సురేష్‌, బొంత శివ, కోడి సతీష్‌ రాజు, నాంపల్లి దీపక్‌, బొంత ఉదయ్‌, కుచం విజయ్‌, దేవాల శ్రీను, గుంజ చిన్న, రాజు గోగుల ప్రవీణ్‌, జానీ పాషా ఉన్నారు.

స్వార్థ ప్రయోజనాల కోసమే పార్టీకి ద్రోహం

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌



అనంతగిరి : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్‌



మోతె : గులాబీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్‌

అనంతగిరి : స్వార్థ ప్రయోజనాల కోసం కన్నతల్లి లాంటి బీఆర్‌ఎస్‌ పార్టీకి కొందరు ద్రోహం చేస్తున్నారని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌ అన్నారు. బుధవారం అనంతగిరి మండలం శాంతినగర్‌లోని శశిధర్‌రెడ్డి ఇంట్లో ఎన్నికల పరిశీలకుడు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్‌ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్‌ శశిధర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోవర్ట్‌ రాజకీయాలకు ప్రతినిధులు వేనేపల్లి చందర్‌రావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అని ఆయన ఆరోపించారు. నాడు అధికారంలో ఉండి ప్రజాధనాన్ని సూట్‌కేసులలో నింపుకున్న వీరి అవినీతి బాగోతం అందరికీ తెలుసని అన్నారు. వీరు కోదాడలో పేకాట క్లబ్బులు, మూడుముక్కల ఆట, మద్యం సిండికేట్‌, చేపల చెరువులు, పిచ్చి సారా, లాడ్జి వ్యాపారాలు నడపలేదా అని ఎమ్మెల్యే మండిపడ్డారు. గత ఐదేళ్లలో ప్రజల మధ్య ఉండి ఎంతో అభివృద్ధి చేశానన్నారు. ఈనెల 29న జరిగే సీఎం కేసీఆర్‌ ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్‌ నాయకులు అజయ్‌కుమార్‌, కాసాని వెంకటేశ్వర్లు, ఏలూరి వెంకటేశ్వరరావు, శీలం సైదులు, పాలడుగు ప్రసాద్‌, సతీష్‌, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

మోతె : మండలంలోని బుర్కచర్ల, మేకలపాడుతండాలకు చెందిన కాంగ్రెస్‌ పార్టీ కార్యకర్తలు 50 కుటుంబాల వారు బుధవారం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌ సమక్షంలో బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ పార్టీ మండల అధ్యక్షుడు శీలం సైదులు, కొండ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

జనంలోనే ఉండి సేవ చేస్తున్నా : ఎమ్మెల్యే



హుజూర్‌నగర్‌ : గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్‌ : నిత్యం జనంలోనే ఉండి జనం కోసం సేవ చేస్తున్నానని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. హుజూర్‌నగర్‌లోని 27వ వార్డు, దీక్షిత్‌ నగర్‌, పూసల బజార్‌లకు చెందిన తిప్పని రాములు, తిప్పని మట్టపల్లి, నాయిని శ్రీనివాసరావు, తిప్పని గురుమూర్తి, తోట చిన్న సుబ్బారావు వారి అనుచరులు బుధవారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు క్యాంపు కార్యాలయంలో బీఎస్పీ నాయకుడు డి. శ్రీనివాస్‌యాదవ్‌ ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులోనే ఉంటున్నానని, ప్రజలు సమస్యలన్నీ పరిష్కరిస్తున్నానని తనపై నమ్మకం ఉంచి అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అమర్‌నాథ్‌రెడ్డి, అమర్‌గౌడ్‌, జెడ్పీటీసీ సైదిరెడ్డి, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ జక్కుల నాగేశ్వరరావు, కౌన్సిలర్లు కె.శ్రీను, గురవయ్య, మంగమ్మ, నాయకులు శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

ప్రజలు ఆయురారోగ్యాలతో జీవించాలి

హుజూర్‌నగర్‌ : కనకదుర్గమ్మ దీవెనలతో తెలంగాణ ప్రజలు ఆయురారోగ్యాలు, సిరి సంపదలతో జీవించాలని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 14, 15 వార్డుల్లో శ్రీకనకదుర్గ నవరాత్రి ఉత్సవాల ముగింపులో ఆయన పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ పట్టణ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, అమర్‌గౌడ్‌, కౌన్సిలర్లు దొంగరి మంగమ్మ, కేఎల్‌ఎన్‌రావు నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీ విజిల్‌ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- రిటర్నింగ్‌ అధికారి జగదీశ్వర్‌రెడ్డి



సీ విజిల్‌ యాప్‌ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, అధికారులు

హుజూర్‌నగర్‌ : సీ విజిల్‌ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని రిటర్నింగ్‌ అధికారి, ఆర్డీఓ జగదీశ్వర్‌ రెడ్డి అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని కార్యాలయంలో సీ విజిల్‌ యాప్‌కు సంబంధించిన పోస్టర్‌ ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే సీ విజిల్‌ యాప్‌ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదు చేస్తే 100 నిమిషాలలోపు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ నాగార్జునరెడ్డి, ఎంపీడీఓ శాంతకుమారి, ఎంఈఓ సైదానాయక్‌ పాల్గొన్నారు.

ఎన్నికల విధులు, నిర్వాహణపై నేడు సమావేశం

హుజూర్‌నగర్‌లోని స్వర్ణవేదిక ఫంక్షన్‌ హాల్‌లో గురువారం ఎన్నికల విధులు, నిర్వాహణపై ఎన్నికల సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్నట్లు రిటర్నింగ్‌ ఆఫీసర్‌, ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి చెప్పారు. సమావేశానికి జిల్లా కలెక్టర్‌ వెంకట్రావ్‌ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

అంగరంగ వైభవంగా అమ్మవారి శోభాయాత్ర



నేరేడుచర్లలో అమ్మవారి శోభాయాత్ర నిర్వహిస్తున్న నిర్వాహకులు



నేరేడుచర్ల : దుర్గామాత ఊరేగింపులో కోయల కళా ప్రదర్శన



గరిడేపల్లి : గుండాలమిట్టలో..

నేరేడుచర్ల : శ్రీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నేరేడుచర్ల పట్టణంలోని విజయదుర్గ ఆలయంతో పాటు పలు చోట్ల ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాల శోభాయాత్రను బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు కళాకారులు, కోయల ఆటలు, మహిళలు కోలాట ప్రదర్శన నిర్వహించారు. గరిడేపల్లి, పాలకవీడు మండలాల నుంచి భవానీ మాలధారులు, భక్తులు అమ్మవారి శోభాయాత్రకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్థానిక ఎస్‌ఐ పరమేష్‌, పోలీస్‌ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండల కేంద్రంలోని గుండాలమిట్ట, తుంబాయిగడ్డ, అంబేడ్కర్‌ నగర్‌, కీతవారిగూడెం, గానుగబండతో పాటు పలు గ్రామాల్లో బుధవారం దుర్గామాత ఊరేగింపును కోలాట ప్రదర్శనతో నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

27న సూర్యాపేటలో అమిత్‌షా సభ



కాషాయం కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానిస్తున్న చల్లా శ్రీలతారెడ్డి

నేరేడుచర్ల : సూర్యాపేటలో ఈనెల 27న నిర్వహించబోయే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా జనగర్జన సభను విజయవంతం చేయాలని బీజేపీ నియోజకవర్గ నాయకురాలు చల్లా శ్రీలతారెడ్డి అన్నారు. బుధవారం నేరేడుచర్లలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో వైఫల్యం చెందిందని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. అనంతరం వివిధ పార్టీల నుంచి పలువురు బీజేపీలో చేరగా వారికి ఆమె కాషాయం కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొణతం లచ్చిరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి కొణతం నాగిరెడ్డి, నాయకులు రామ్మూర్తి, ఊర్మిళ, నరేందర్‌ రెడ్డి, అశోక్‌, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.